

సేవ చేశాం.. సహకరించండి

చిత్తశుద్ధితో ప్రజలకు సేవచేశామని, తమకు సహకరించి బాధ్యతలు అప్పగించాలని వలంటీర్లు కోరారు. - 8లో



మరువ'లేఖ'

ఒకప్పుడు ఎన్నో మధుర జ్ఞాపకాలను మిగిల్చిన ఉత్తరాలు.. ఇప్పుడు సెల్‌ఫోన్‌ల రాకతో కనుమరుగయ్యాయి. - 8లో



శ్రీవారి మెట్టుకు వెళ్లే మార్గం..

శ్రీనివాసమంగాపురం నుంచి శ్రీవారి మెట్టుకు వెళ్లే మార్గంలో సదరు స్థల యజమాని ట్యాంక్ అడ్డుగా పెట్టారు. - 8లో

తొమ్మిదేళ్లుగా నిరీక్షణే!

పురాతనమైన అతి పెద్ద జలమార్గం బకింగ్ హామ్ కెనాల్. ఒకప్పుడు వస్తువుల రవాణాలో కీలకంగా ఉండేది. నిత్యం పడవల రాకపోకలతో రద్దీగా ఉండేది. ఇప్పుడు పాలకుల నిర్లక్ష్యానికి గురై కుంచించుకుపోయింది. వేలాది మత్స్యకార కుటుంబాలకు జీవనాధారంగా విలసిల్లిన కాలువ దయనీయస్థితిలోకి వెళ్లిపోయింది. కెనాల్ పునరుద్ధరణకు కేంద్రప్రభుత్వం రూ.3వేల కోట్లు విడుదల చేసి ఏళ్లు గడుస్తున్నా పనుల్లో పురోగతి ఆగిపోయింది. హడావుడిగా సర్వే చేసి తొమ్మిదేళ్లు పూర్తయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుగా మారింది. కబ్జాల పర్వంపై పక్కాగా వివరాలున్నా.. ఆక్రమణల తొలగింపులో అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తూనే ఉంది. ఇప్పటికైనా మోదీ సర్కారు ఈ దిశగా దృష్టి సారించాలని తీర ప్రాంతం ఆశగా ఎదురుచూస్తోంది.

- ప్రశ్నార్థకంగానే బకింగ్ హామ్ కెనాల్ ఆధునీకీకరణ
- దశాబ్దాలుగా మాటలకే పరిమితమవుతున్న నవీనీకరణ
- పునరుద్ధరిస్తే తీరానికి పూర్వవైభవం
- కేంద్రం కేటాయించిన రూ.3వేల కోట్లు పేపర్లకే పరిమితం
- సర్వే పూర్తయ్యి ఏళ్లు గడుస్తున్నా.. కదలని పనులు
- కబ్జా కోరల్లో చిక్కుకున్న 500 ఎకరాలు
- కాలువ పురోగతి కోసం తీర ప్రాంతవాసుల ఎదురుచూపులు



తూపిలిపాళెం వద్ద చిక్కిపోయిన బకింగ్‌హామ్ కెనాల్ (ఇన్‌సెట్) దుగరాజపట్నం పంచాయతీ పరిధిలో ఆక్రమణలు



వాకాడు : కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంతో ఆర్భాటంగా బకింగ్‌హామ్ కెనాల్‌ను ఆధునీకరిస్తామని ప్రకటించారు. జల రవాణా మార్గాన్ని పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే అప్పట్లో కెనాల్‌ను పరిశీలించిన కేంద్ర ఇంజినీర్ల బృందం ఎస్టిమేషన్లు తయారు చేసింది. కేంద్ర ప్రభుత్వం సైతం వెంటనే కాలువ నవీనీకరణ పనులకు రూ.3 వేల కోట్లు కేటాయించింది. ఈ మేరకు 2015 జూన్ 30న ఢిల్లీ నుంచి వచ్చిన సర్వే బృందం నెల్లూరు జిల్లా కావలి రూరల్ మండలం చెన్నాయపాళెం వద్ద నుంచి గ్లోబల్ జీపీఎస్ సర్వే చేపట్టింది. ఈ సర్వే మొదట్లో కొంత ఆలస్యంగా సాగినప్పటికీ తదనంతరం పక్కా ప్రణాళికతో కావలి నుంచి ఊటుకూరు వరకు ఒక బిట్‌గా, పెన్నా రివర్ కుడితిపాళెం నుంచి ముత్తుకూరు మండలం కృష్ణపట్నం వరకు రెండో బిట్‌గా, కృష్ణపట్నం నుంచి తడ వరకు మూడు బిట్‌గా సర్వేను వేగవంతంగా పూర్తిచేసింది. అలాగే సరికొత్త గ్లోబల్ జీపీఎస్ టెక్నాలజీతో తక్కువ కాలంలో ఈ సర్వే నిర్వహించి ఆక్రమణలపై నివేదికలు సిద్ధం చేసి ఆయా మండలాల రెవెన్యూ కార్యాలయాలకు అందజేసింది. అయితే ఇప్పటి వరకు ఆక్రమణలకు సంబంధించి ఎలాంటి హద్దు రాళ్లు వేయడం గాని, నోటీసులు ఇవ్వడం గాని, స్వాధీనం చేసుకోవడం గాని ఎక్కడా జరగలేదు. ఇప్పుడు మూడో పర్యాయం కూడా మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఈ దఫా అయినా బకింగ్ హామ్ కెనాల్‌కు పూర్వ వైభవం సంతరించుకుంటుందేమో అని తీర ప్రాంత వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ప్రస్తుతం మొనపాళెం వద్ద జల రవాణా ఆనవాళ్లతో కనిపిస్తున్న కెనాల్

1994లో తొలి అడుగు

ఈ జల రవాణా మార్గాన్ని పునరుద్ధరించాలని మొదటి 1994లో అప్పటి కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు సర్వే బాధ్యతలను రైట్స్ ఇండియా సంస్థకు అప్పగించింది. ఈ క్రమంలోనే దేశీయ జలమార్గాలను పునరుద్ధరించాలని, ఇన్‌లాండ్ వాటర్ హౌస్ అథారిటీ ప్రతిపాదనలను అమలు చేయాలని ప్రస్తుత మోదీ ప్రభుత్వం సైతం అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే కెనాల్ ఆధునికీకరణకు సర్వే పూర్తి చేయింది.

కెనాల్ నిర్మాణం ఇలా..

ఆంధ్ర- తమిళనాడు రాష్ట్రాల మధ్య అతి పెద్ద జల మార్గమైన బకింగ్‌హామ్ కెనాల్‌ను 1896 లో నిర్మించారు. బంగాళాఖాతం వెంబడి 796 కిలోమీటర్ల పొడవునా కాలువ విస్తరించి ఉంది. అలాగే ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 11 తీర ప్రాంత మండలాలను తాకుతూ 178 కిలోమీటర్ల మేర ఈ కాలువ పయనిస్తుంది. దీన్ని అప్పట్లో బకింగ్ హామ్ అనే బ్రిటీష్ దొర ఆధ్వర్యంలో నిర్మించారు. అందుకనే ఈ కాలువకు బకింగ్ హామ్ కెనాల్ అని పేరు వచ్చింది. రోడ్డు, రైలు మార్గాల కంటే అత్యంత చౌకగా వస్తువులను రవాణా చేయవచ్చు ననే ఉద్దేశంతో ఈ జలమార్గాన్ని ఆనాటి బ్రిటీష్ పాలకులు నిర్మించారు. కానీ, కాలక్రమంలో ఈ కాలువ నిర్లక్ష్యానికి గురై ఆక్రమణల చెరలో చిక్కుకొని బక్కచిక్కిపోయింది.

ఒక్కో ప్రాంతంలో.. ఒక్కో పేరు

ఈ కాలువకు ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరు ఉంది. కాకినాడ నుంచి రాజమండ్రి వరకు గోదావరి కాలువగా, దవళేశ్వరం బ్యారేజ్ నుంచి విజయవాడ వరకు ఏలూరు కాలువగా, విజయవాడ నుంచి పెద గంజాం లాకుల వరకు కొమ్మమూరు కాలువగా, పెద్ద గంజాం నుంచి చెన్నై వరకు బకింగ్‌హామ్ కెనాల్‌గా పిలుస్తారు. ఈ కెనాల్ జలరవాణాకే కాకుండా సముద్ర సమీపంలోని వందలాది గ్రామాలు, లక్షలాది ఎకరాలను భారీ వర్షాలు, వరదల సమయంలో కోతకు గురి కాకుండా రక్షణ కల్పిస్తోంది. తీర మండలాల్లో వెల్లువలా వచ్చే వరద నీరు ఈ కాలువ ద్వారానే సముద్రంలో కలుస్తుంది. అయితే కాలక్రమంలో ఈకాలువను పర్యవేక్షించే వారు కరువై పూడిక తీతకు నోచుకోకపోవడంతో ఉనికిని కోల్పోతోంది.

పునరుద్ధరణతో అభివృద్ధి

బ్రిటీష్ కాలంలోనే కాకుండా స్వతంత్ర్య భారతావనిలో కూడా బకింగ్ హామ్ కెనాల్ ఓ వెలుగ వెలిగింది. తర్వాత రూ.వందల కోట్లు విలువైన భూములు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని కావలి, అల్లూరు, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట, తోటపల్లి గూడూరు, ముత్తుకూరు, చిల్లకూరు, కోట, వాకాడు, తడ, సూళ్లూరుపేట మండలాల్లో దాదాపు 500 ఎకరాలకు పైగా కెనాల్ భూములు ఆక్రమణకు గురై ఉన్నట్లు అధికారులు గుర్తించారు.. కేంద్ర ప్రభుత్వం అనుకున్న విధంగా చారిత్రక బకింగ్ హామ్ కెనాల్‌ను పునరుద్ధరిస్తే తిరిగి జల రవాణకు మార్గం సుగమం అవుతుంది. అలాగే పోర్టులు, ఫిషింగ్ హార్బర్లను అనుసంధానించడం ద్వారా తీర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశముంటుంది. కోస్తా కారిడార్ విశేషంగా అభివృద్ధి చెందుతుంది. వేలాది మత్స్యకార కుటుంబాలకు ఉపాధి దొరుకుతుంది.

ఉండాల్సిన కొలతలు ఇవీ..

కెనాల్ సెంటర్ పాయింట్ నుంచి అటు 50 మీటర్లు.. ఇటు 50 మీటర్లు ఉండాలి. కానీ, ప్రస్తుతం ఆక్రమణల కారణంగా 10 మీటర్లు కూడా వెడల్పు లేకుండా కుంచించుకుపోయింది. కాలువ నిర్వహణ, పర్యవేక్షణకు గాను మైపాడులో నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ ఏర్పాటు చేశారు. అల్లూరు, ముత్తుకూరు, సూళ్లూరుపేటలో సెక్షన్ కార్యాలయాలు కూడా ఏర్పాటు చేశారు. 1979, 1984, 1991లో వచ్చిన తుపానుల కారణంగా కాలువతో పాటు సెక్షన్ కార్యాలయాలు కూడా దెబ్బతిన్నాయి. తర్వాత మరమ్మతులు చేయించకపోవడంతో అవి కాస్తా మూతపడ్డాయి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అనుకున్న లక్ష్యం పూర్తి చేస్తే బకింగ్‌హామ్ కెనాల్ పూర్వ వైభవం సంతరించుకుంటుంది.

న్యూస్‌రీల్

తిరుపతి ఎంపీ గురుమూర్తి ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : తిరుపతి పార్లమెంట్ సభ్యుడిగా వైఎస్సార్‌సీపీ నుంచి రెండోసారి ఎన్నికైన మద్దిల గురుమూర్తి సోమవారం ఢిల్లీలోని పార్లమెంట్‌లో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆశీస్సులతో, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రజల ఆదరాభిమానాలతో ఎంపీగా ఎన్నికైనట్లు వెల్లడించారు. ఎల్లప్పుడూ జనాలకు అందుబాటులో ఉంటూ, నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తానని వెల్లడించారు. అలాగే తన విజయం కోసం అహర్నిశలు కృషి చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగమేళాలో 10మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పురుషుల డిగ్రీ కళాశాలలో సోమవారం జేకేసీ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఇందులో 10 మంది వివిధ పోస్టులకు ఎంపికయ్యారు. శ్రీజ మహిళ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ, ఎన్‌ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 25మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 10మందిని ఎంపిక చేశారు.వీరికి రూ.16వేల నుంచి రూ.25వేల వరకు జీతం, ఇతర అలవెన్సులు లభిస్తాయని ప్రిన్సిపల్ ఎం.శ్రీలత తెలిపారు. కార్యక్రమంలో జేకేసీ కో–ఆర్డినేటర్ సతీష్‌కుమార్, అధ్యాపకులు గిరిజమ్మ పాల్గొన్నారు.


స్కిల్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్



వర్క్‌షాప్ సందర్శనలో వీసీ భారతి తదితరులు

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. సోమవారం వర్సిటీ వీసీ భారతి వర్క్‌షాప్‌ను సందర్శించారు. వీసీ మాట్లాడుతూ ఆరు రోజుల పాటు నిర్వహించే ఈ వర్క్‌షాపులో ప్రధానంగా విద్యార్థులకు లైఫ్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, కమ్యునికేషన్ స్కిల్స్, ప్రజెంటేషన్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ అనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి వై.రజని, సౌమ్య రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించనున్నారు. వర్క్‌షాపును సందర్శించిన వీసీతో పాటు ప్రొఫెసర్ ఎం.ఉషారాణి ఉన్నారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు



విశేషాలంకారంలో స్వామివారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయ స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన చేపట్టారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ జలం, పసుపు, కుంకుమ, విభూదితో అభిషేకం చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయి, భక్తులు శిలాతోరణం వరకు బారులు తీరారు. ఆదివారం అర్ధరాత్రి వరకు 81,455 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 31,251 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.67 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

శ్రీవారి ఆలయ విశేషాలపై సమీక్ష



నారాయణగిరి క్యూను పరిశీలిస్తున్న టీటీడీ ఈఓ శ్యామల రావు

తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయం, చరిత్ర, వాస్తుశిల్పం, విశిష్టత, సంబంధిత విశేషాలపై టీటీడీ ఈఓ జె.శ్యామలరావు సమీక్షించారు. సోమవారం సాయంత్రం తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో చేపట్టిన సమీక్షలో జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిరుమల శ్రీవారి ఆలయ చరిత్ర, వైఖానస ఆగమ, జీయంగార్ వ్యవస్థ, వివిధ ఆచార వ్యవహారాలు, నిత్య, వార, మాస, వార్షిక సేవా కార్యక్రమాలు, సుప్రభాతం నుంచి ఏకాంతం వరకు ప్రతిరోజు శ్రీవారికి నిర్వహించే వివిధ కైంకర్యాలను సవివరంగా వివరించారు. ఈఓ మాట్లాడుతూ సేవలు, వీఐపీ దర్శనం, సర్వ దర్శనం, ఆర్జిత సేవలు, ఇతర దర్శనాలపై నివేదిక పంపవలసిందిగా అధికారులను ఆదేశించారు. సమావేశానికి ముందు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నారాయణగిరి షెడ్లను ఈఓ పరిశీలించారు. కార్యక్రమంలో జేఈఓలతో పాటు సీవీఎస్ఓ నరసింహకిషోర్, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ–2 జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

టీటీడీ ట్రస్ట్‌లకు రూ.20 లక్షల విరాళం

జార్ఖండ్‌కు చెందిన సరళా ఇంజినీరింగ్ లిమిటెడ్ వారు టీటీడీ ట్రస్టులకు రూ.20 లక్షలు విరాళంగా అందించారు. ఎస్వీబీసీ ట్రస్ట్‌కు రూ.10 లక్షలు, ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్ కు రూ.10 లక్షలు అందజేశారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధి తిరుపతికి చెందిన రాఘవేంద్ర సోమవారం తిరుమల గోకులం విశ్రాంతి గృహంలో టీటీడీ ఈఓ శ్యామలరావుకు డీడీలు అందించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 85 ఫిర్యాదులు

తిరుపతి క్రైం : జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 85 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఈ మేరకు ఆయా ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్‌లకు బదిలీ చేసినట్లు వెల్లడించారు. సమస్యలను పరిష్కరించి, బాధితులకు న్యాయం చేసి తమ కార్యాలయానికి పూర్తి సమాచారం అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో చోరీలు, ఆస్తి తగాదాలు, ఆర్థిక లావాదేవీ వ్యవహారాలు ఉన్నట్లు తెలిపారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి అభినందన



మిథున్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న హరిప్రసాద్‌రెడ్డి, తదితరులు

తిరుపతి సిటీ : రాజంపేట ఎంపీగా హ్యాట్రిక్ విజయం సాధించిన పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సోమవారం పార్లమెంట్ సభ్యునిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత హరి ప్రసాద్‌రెడ్డి ఢిల్లీలో ఎంపీని కలసి పుష్పగుచ్ఛం అందించారు. ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు హరీష్‌రెడ్డి, బీరేంద్ర వర్మ, బీవీఆర్ చౌదరి, ముమ్మిడివరం శ్రీను, రాజు, రాహుల్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



సమస్యలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జి కలెక్టర్, ఇతర అధికారులు

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని, నిర్ణీత గడువులోపు అర్జీదారులకు న్యాయం చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యాన్ చంద్ర ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నూతనంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తోపాటు డీఆర్‌ఓ పెంచల కిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మురళి, దేవేంద్రరెడ్డి అర్జీలను స్వీకరించారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు అధికారులు తప్పకుండా హాజరుకావాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో సైతం గ్రీవెన్స్ నిర్వహించాలని తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించాలని సూచించారు. కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు మొత్తం 109 అర్జీలు అందినట్లు వివరించారు.

జిల్లా పరిషత్ చాంబర్‌లో..

పరిపాలన సౌలభ్యం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022 ఏప్రిల్ 4వ తేదీన జిల్లా పునర్విభజన చేసిన విషయం విదితమే. విభజన తర్వాత రెండు నెలల వ్యవధిలో ముఖ్యమైన అన్ని విభాగాలు కలెక్టరేట్‌కు చేరుకున్నాయి. ఈ క్రమంలోనే జిల్లా పరిషత్ కార్యాలయానికి ఓ చాంబర్ ఏర్పాటు చేశారు. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లా నేపథ్యంలో జెడ్పీ కార్యాలయం తిరుపతి జిల్లాకు ఇంకా రాలేదు. చిత్తూరులోనే ఉంది. ఈ క్రమంలో జెడ్పీకి కలెక్టరేట్‌లో కేటాయించిన చాంబర్ ఖాళీగా ఉండడంతో అందులో సోమవారం నుంచి గ్రీవెన్స్ నిర్వహించడం ప్రారంభించారు. అయితే ఆ చాంబర్‌లో రీసౌండ్ ఎక్కువగా వస్తోందని అర్జీదారులు విన్నవిస్తున్న సమస్యలు అర్థం కావడం లేదని జిల్లా అధికారులు వెల్లడించారు.

కబ్జాలపై కన్నెర్ర

సాక్షి ఎఫెక్ట్..

- చెరువులు, కాలువల ఆక్రమణపై కలెక్టర్ ఆగ్రహం
- క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశం

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలంలో చెరువులు, కాలువల కబ్జాపై ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యాన్‌చంద్ర కన్నెర్ర చేశారు. ఎమ్మెల్యే నాని పేరుతో గ్రామాల్లో టీడీపీకి చెందిన చోటా నేతలు సాగిస్తున్న కబ్జాల పర్వంపై సాక్షిలో సోమవారం ప్రచురితమైన 'చెరువు మట్టి...చెరబట్టి' కథనం అధికార పార్టీ, రెవెన్యూ వర్గాల్లో అలజడి రేపింది. దీనిపై ఇన్‌చార్జి కలెక్టర్ స్పందించారు. ఆక్రమణలు జరుగుతంటే చోద్యం చూస్తున్నారా....అంటూ తిరుపతి రూరల్ రెవెన్యూ అధికారులతో పాటు ఆర్డీఓ నిషాంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆక్రమణలను పరిశీలించి, వాటిని తొలగించాలని, కబ్జారాయుళ్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. దీంతో సోమవారం మధ్యాహ్నమే ఆర్డీఓ హుటాహుటిన రూరల్ మండలం పైడిపల్లె పంచాయతీ సర్వే నంబర్ 187లో కాలువను పూడ్చి వేసి చేపట్టిన ఆక్రమణలను స్వయంగా పరిశీలించారు. రూరల్ ఆర్‌ఐ శివకుమార్, వీఆర్‌ఓ రేవతి, సర్వేయర్ భరణితో కలిసి రెవెన్యూ రికార్డులను తనిఖీ చేశారు. కాలువ ఆక్రమణలకు గురైనట్లు నిర్ధారించారు. కబ్జాకు పాల్పడిన పిల్లపాళెం పరంధామరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆర్‌ఐ శివకుమార్‌ను ఆదేశించారు.



పైడిపల్లెలో కాలువ కబ్జాను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ నిషాంత్‌రెడ్డి

కాలువలో ఆక్రమణలు తొలగించి, అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలని వీఆర్‌ఓ రేవతికి సూచించారు. పట్టపగలే కాలువను పూడ్చి వేస్తుంటే నిద్రపోతున్నారా....అంటూ మండిపడ్డారు. కాలువ కబ్జాపై వీఆర్‌ఓకు సమాచారం ఇచ్చినా స్పందించలేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. పత్రికల్లో కథనాలు వచ్చే వరకు చోద్యం చూస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని వీఆర్‌ఓను హెచ్చరించారు.

పేరూరు చెరువు పాపం ఏంటో..?

పైడిపల్లెతో పాటు పేరూరు చెరువు, రామానుజపల్లె కాలువను సైతం ఆక్రమిస్తున్నారని పత్రికల్లో కథనాలు వచ్చాయి. వాటిని కూడా పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యాన్‌చంద్ర ఆదేశించారు. అయితే ఆర్డీఓ మాత్రం కేవలం పైడిపల్లెలో కాలువ ఆక్రమణలను మాత్రం పరిశీలించి పేరూరుకు వెళ్లకుండా వెనుదిరిగారు. ఆర్డీఓ వస్తే ఎమ్మెల్యే నాని పేరు చెప్పి ఎంపీటీసీ మాజీ సభ్యుడు, టీడీపీ చోటా నేతలు చేస్తున్న ఆక్రమణలు, కబ్జాలను చూపించేందుకు వేచి ఉన్న పేరూరు వాసులకు ఆయన అర్థాంతరంగా వెనక్కి వెళ్లిపోయారని తెలియడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజకీయంగా ఒత్తిడి రావడంతోనే ఆర్డీఓ వెనుదిరిగారని ఇన్‌చార్జి కలెక్టర్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇంత జరిగినా పేరూరులో ఆక్రమణలను తొలగించి, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ అధికారులు ముందుకు రాకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యాన్‌చంద్ర స్పందించి పేరూరు చెరువు, రామానుజపల్లె కాలువపై ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఎస్పీకి అదనపు బాధ్యత


ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్ : ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు తిరుపతి ఎర్రచందనం టాస్క్ ఫోర్స్ ఎస్పీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎస్పీ హర్షవర్ధన్ రాజు సోమవారం క్యాంప్ కార్యాలయంలో అదనపు బాధ్యతలు చేపట్టారు. విలువైన అటవీ సంపదను కాపాడేందుకు తన వంతు కృషి చేస్తానని, నిరంతరం తమ సిబ్బందిని అప్రమత్తం చేస్తానని వెల్లడించారు. ఎర్ర దొంగల ఆట కట్టిస్తామని స్పష్టం చేశారు. అక్రమంగా అటవీ ప్రాంతంలోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడితే ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిపాలనా భవనం ఎదుట సోమవారం వేకువజామున వీధి కుక్కల దాడిలో ఓ జింక మృతి చెందింది. ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన వర్సిటీ ఉద్యోగులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు పరిశీలించి కుక్కల దాడిలోనే జింక మరణించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం జింక కళేబరాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. దీనిపై వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులు మాట్లాడుతూ కుక్కల సంఖ్యల ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయిందని, నగరపాలక సంస్థ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కుక్కల తాకిడి నివారణ దిశగా పనిచేయాలని సూచించారు.

నిరుపయోగంగా మారిన పోస్టుబాక్స్



ఉత్తరాలు వేరు చేస్తున్న పోస్ట్‌మన్




కడివేడులోని పోస్టు ఆఫీస్



- మధుర జ్ఞాపకాలను మిగిల్చిన ఉత్తరం
- ఒకప్పుడు తంతి తపాలా ద్వారానే సమాచారం
- ఇప్పుడు వాట్సాప్ మెసేజ్‌లతో సరిపెట్టేస్తున్న జనం

మరువ లేఖ

చిల్లకూరు : తోక లేని పిట్ట తొంభై ఆమడల దూరం పోయింది.. అది ఏంటీ అనే సామెత అడిగిన వెంటనే 'ఉత్తరం' అని సమాధానం వచ్చేది. అయితే ఇప్పుడు ఆ మాట చెప్పుకునేందుకే తప్ప.. ఉత్తరం రాసేవారే కరువయ్యారు. పోస్టు అని ఇంటి ముంగిట పోస్టు మ్యాన్ కేక వేయగానే.. ఉత్తరం అందుకునేందుకు ఉరుకున వచ్చేవారు. తమ బంధుమిత్రులు అందించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు ఉత్సుకతతో ఉత్తరాల కోసం ఎదురుచూసేవారు. మంచి వార్తను మోసుకొచ్చిన జాబులను భద్రంగా దాచుకునేవారు. ఆ రోజులు ఓ మధుర జ్ఞాపకాల్లా మిగిలి పోయాయి. నేటి సమాజంలో పిల్లలకు పోస్టులో ఉత్తరం వచ్చి దానిని చదువుకుని ఎంతో తృప్తి పడే వారమని పెద్దలు చెబితే.. ఇంకా లేఖలు ఏంటి.. నేరుగా సెల్‌ఫోన్‌లోమాట్లాడుకుంటున్నాం కదా అని అంటున్నారు. అయితే ముఖాముఖీగా వాట్సాప్ కాల్స్‌లో మాట్లాడుతున్నా, సంబోధనలో ఎన్నో మార్పులు ఉంటాయి. అయితే ఉత్తరంలో పలకరింపులు సంప్రదాయబద్ధంగా ఉంటూ మనసును ఆకట్టుకుంటాయి. పెద్దలైతే మహారాజశ్రీ, చిన్న వారైతే చిరంజీవి, మహిళలను లక్ష్మీ సమానురాలైన, వితంతువులైతే గంగా భాగీరథీ సమానులైన అని సంబోధించేవారు. , అలాగే ఉత్తరం ముగింపులో కూడా పెద్దలకు నమస్కారంతో అని, చిన్నవారికి ఆశీస్సులతో అని రాసేవారు. ఎవరైనా కాలం చేసిన వార్తను ఉత్తరంలో రాసేప్పుడు ఒక వైపున నలుపు రంగు ఉండేలా చూసేవారు. ఆ ఉత్తరాన్ని ఇంట్లోకి తీసుకెళ్లకుండా బయటనే చించివేసేవారు. అలాగే ముఖ్యమైన సమాచారం ఉండే లేఖరను జాగ్రత్తగా ఒక కమ్మీకి కుట్టి పెట్టే వారు.



స్మార్ట్‌ఫోన్ ప్రభావంతోనే..
ఉత్తరాలు రాసుకునే రోజుల్లో ప్రేమలేఖ, శ్రీవారికి ప్రేమలేఖ, ఇలా ఎన్నో లేఖలపై సినిమాలు తీశారు. అవి ప్రేక్షకులను సైతం విశేషంగా అలరించాయి. అయితే నేటి యువత చేతిలోకి వచ్చిన స్మార్ట్ ఫోన్‌ను గంటల తరబడి వాడుతున్నప్పటికీ అవతల వారి పూర్తి యోగ క్షేమాలు మాట్లాడే పరిస్థితి కూడా లేదు. ఒకటి రెండు మాటలు మాట్లాడిన తర్వాత టిక్ టాక్‌లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఇలా వేరే వ్యాపకాలకు మొగ్గుచూపుతున్నారు. క్షేమ సమచారాలను కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులతో పంచుకునేందుకు కూడా ఇష్ట పడడం లేదు. ఉత్తరాలు రాసుకునే సమయంలో మరో ఉత్తరం వచ్చే వరకు ఎదురు చూపులు ఉండేవి. సమయం లేక రాయలేని వారికి ఉత్తరం రాసి చాలా రోజులైందనే దిగులు ఉండేది. కానీ నేడు స్మార్ట్ ఫోన్‌ల రాకతో ఉత్తరాల ఊసే లేకుండా పోయింది. దీంతో యువత అర కొర సందేశా పంపుకుని సంతోష పడుతున్నారే కానీ, పాత కాలంలో లాగా పూర్తి సమాచారం చదువుకుని తృప్తి పడలేక పోతున్నారు.

అక్షర దోషాలు గుర్తించే వెసులుబాటు



ఉత్తరం రాసే సమయంలో వాటిలో ఎలాంటి తప్పులు దొర్లాయి అనే విషయాన్ని చదువుకున్న వారు గుర్తించేవారు. తెలిసినవారు ఇలా రాయకూడదు.. ఇలా రాయాలి అని చెప్పేవారు. దీంతో తప్పులు సరి దిద్దుకునే అవకాశం ఉండేది. అక్షర దోషాలను పక్కాగా గుర్తించే వెసులుబాటు ఉండేది. అయితే ఇప్పుడు రాసే పనేలేకుండా పోయింది. స్మార్ట్‌ఫోన్‌లో వాయిస్ మెసేజ్ పెడుతున్నారు. దీంతో ఎవరికీ ఎలాంటి ఉపయోగం ఉండదు.

- ప్రజేంద్రరెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు, పాలిచెర్లవారిపాలెం, చిల్లకూరు మండలం

సంతోషంగా ఉండేది



ఉత్తరాలు రాసుకుని అందులోని సమాచారం మననం చేసుకుంటూ మరో ఉత్తరం వచ్చే వరకు ఎదురు చూడడం ఎంతో చక్కగా ఉండేది. ఎందుకంటే ఉత్తరంలో రాసే ప్రతి అక్షరం మన మనసులోని భావాలను ప్రతిబింబిస్తాయి. చదువు రాని వారు సైతం తమకు వచ్చిన ఉత్తరాన్ని తీసుకుని వచ్చి చదవమని ఇచ్చేవారు. ఆ సమయంలో అందులో వారికి సంబంధించిన మంచి విషయాలను చెబుతుంటే ఎంతో సంతోషంగా ఉండేది. పెద్ద వారికి ఏదైనా సమాచారం తెలియజేయాలంటే ఉత్తరం ఒక సాధనంలా ఉండేది. ఇంటికి దూరంగా ఉన్న పిల్లలను హెచ్చరించేందుకు ఉపయోపడేవి.

లలితమ్మ(విశ్రాంత ఉపాధ్యాయురాలు, ఏరూరు, చిల్లకూరు మండలం)

గ్రావెల్ తవ్వకాలకు చెక్

సాక్షి ఎఫెక్ట్..

పెళ్లకూరు : మండలంలోని ఎర్రగుంట, నందిమాల గ్రామాలలో అక్రమంగా సాగుతున్న గ్రావెల్ తవ్వకాలను రెవెన్యూ అధికారులు సోమవారం అడ్డుకున్నారు. సోమవారం సాక్షి పత్రికలో 'చెరువుమట్టి... చెరబట్టి' శీర్షికతో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. ఆయా గ్రామాలకు చేరుకుని యంత్రాలను నిలిపేసి, గ్రావెల్ తవ్వకాల నిలిపివేశారు. అనుమతులు లేకుండా చెరువులు, గుంతలు, ప్రభుత్వ భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వీఆర్‌ఓ రవిచంద్ర హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు ముందస్తు బెయిల్

తిరుపతి లీగల్: సార్వత్రిక ఎన్నికల అనంతరం జూన్ 13వ తేదీన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై నమోదైన కేసులో ముగ్గురికి చిత్తూరు ఆరవ అదనపు జిల్లా జడ్జి కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసినట్టు న్యాయవాది యు.శేఖర్ బాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ టీడీపీకి చెందిన ఓ మహిళా కార్యకర్త ఫిర్యాదు మేరకు కూచువారిపల్లెకు చెందిన కొటాల చంద్రశేఖర్‌రెడ్డి తోపాటు 12 మందిపై చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. దీనిపై కొటాల చంద్రశేఖర్ రెడ్డితోపాటు నవీన్, బాలు అలియాస్ బాలాజీ ముందస్తు బెయిల్ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వారి వాదనలు విన్న న్యాయమూర్తి ముగ్గురికీ ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కొక్కరు రూ.20వేల చొప్పున ఇద్దరు జామీన్ దారుల పూచీకత్తుపై విడుదల చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు ముగ్గురు సోమవారం తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జామీనుదారులను హాజరు పరచి బెయిల్ పొందారు.

దాడికి యత్నం?
కోర్టులో జామీనుదారులను హాజరుపరిచేందుకు వచ్చిన కొటాల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులపై 60 మంది టీడీపీ కార్యకర్తలు దాడికి యత్నించారు. దీనిపై ముందస్తుగా సమాచారం అందుకున్న కొటాల తదితరులు వెంటనే పోలీసులకు ఫిరాదు చేశారు. దీంతో పోలీసులు రక్షణ కల్పించారు. కోర్టు నుంచి వారు ఇళ్ల వెళ్లేవరకు వెంట నడిచారు. ఈ మేరకు న్యాయమూర్తులకు సైతం టీడీపీ కార్యకర్తల విషయం తెలిసినట్లు సమాచారం.

టీమ్ ఇండియాదే విజయం


శ్రీవారి ఆలయం వెలుపల చాముండేశ్వరీనాథ్

తిరుమల : టీ–20 వరల్డ్ కప్‌లో సోమవారం జరగబోయే మ్యాచ్ మాత్రమే కాదని, ట్రోఫీని టీమ్ ఇండియానే గెలుస్తుందని మాజీ క్రికెటర్ చాముండేశ్వరీనాథ్ తెలిపారు. సోమవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. ఆస్ట్రేలియాతో జరగనున్న సెమీ ఫైనల్ మ్యాచ్ చాలా టఫ్‌గా ఉంటుందన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌తో ఆస్ట్రేలియా ఓడింది కాబట్టి ముఖ్యమైన మ్యాచ్‌లలో గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఈ మ్యాచ్‌లో టీమ్ ఇండియా చాలా జాగ్రత్తగా ఆడాలని సూచించారు. ఇండియా సెమీస్‌కు చేరుకుని ట్రోఫీ కొట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయని స్పష్టం చేశారు.

29న జాతీయ లోక్ అదాలత్


న్యాయమూర్తి గురునాథ్

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలో ఈనెల 29వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవ సంస్థ చైర్మన్ ఎం.గురునాథ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు అదాలత్ ప్రారంభమవుతుందన్నారు. కేసుల పరిష్కారం కోసం ప్రత్యేకంగా 8 బెంచ్‌లు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. బెంచ్‌లకు అధ్యక్షులుగా తనతో పాటు తిరుపతి నాలుగో అదనపు జిల్లా జడ్జి అర్చన, తిరుపతి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బి.విజయ సారథిరాజు, జూనియర్ సివిల్ జడ్జిలు సత్యకుమార్, కోటేశ్వరరావు, సంధ్యారాణి, గ్రంధి శ్రీనివాస్, వై.సరిత వ్యవహరించనున్నట్లు వివరించారు. రాజీ చేసుకోదగిన క్రిమినల్ , సివిల్, యాక్సిడెంట్, వివాహ సంబంధిత, ఇతరత్రా కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు. న్యాయవాదులు, పోలీసులు, ఇతర అధికారులు కేసుల పరిష్కారానికి సహకరించాలని కోరారు.

శ్రీవారి మెట్టుకు వెళ్లే మార్గం అడ్డగింత

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురం నుంచి శ్రీవారి మెట్టుకు వెళ్లే మార్గాన్ని స్థల యజమాని అడ్డుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. శ్రీనివాస మంగాపురం నుంచి శ్రీవారి మెట్టుకు ప్రధాన రహదారి ఉండేది. అయితే గత కొద్ది నెలలుగా రైల్వే వంతెన పనులు జరుగుతున్న నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం ఓ ప్రైవేటు వెంచర్ నుంచి తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేశారు. ఇటీవల రద్దీ విపరీతంగా పెరగడంతో పాటు అధికంగా వాహనాలు వస్తున్నాయి. ఈ క్రమంలో తరచూ ట్యాక్సీ డ్రైవర్ల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో ప్రైవేటు వెంచర్ యజమాని సోమవారం ఉదయం వాహనాల రాకపోకలకు అడ్డుగా ట్రాక్టర్ ట్యాంకర్‌ను పెటించాడు. దీంతో శ్రీనివాసమంగాపురం నుంచి శ్రీవారి మెట్టుకు వెళ్లి వచ్చే వాహనాలకు అంతరాయం ఏర్పడడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న టీటీడీ అధికారులు వెంచర్ యజమానితో చర్చలు జరిపారు. పెద్ద సంఖ్యలో వాహనాలు తిరుగుతుండటంతో వెంచర్‌లోని రోడ్లు దెబ్బతింటున్నాయని భూ యజమాని ఆవేదన వ్యక్తం చేశారు.అయితే టీటీడీ అధికారులు నచ్చజెప్పడంతో ఆయన మార్గం పునరుద్ధరణకు అంగీకరించారు.

జాతీయ స్థాయి ఆర్చరీకి శ్రీచైతన్య విద్యార్థిని


శరధ్నిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ రూపాదేవి

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థిని కె.శరధ్ని జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రూపాదేవి, ఏజీఎం సురేష్ మాట్లాడుతూ తమ విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచి జాతీయ స్థాయికి ఎంపికైందన్నారు. అలాగే చదువులో సైతం అద్భుతంగా రాణిస్తోందని ప్రశంసించారు. అనంతరం ప్రతిభ చాటిని విద్యార్థినికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ బాలాజీ, డీన్ సుబ్రమణ్యం, ఇన్‌చార్జిలు త్రివేణి, థామస్, కల్పన, వాసంతి, పీఈటీ మేఘన, ఏఓ సురేష్ పాల్గొన్నారు.

'శ్రేష్ట'లో మహీన్‌కు 56వ ర్యాంకు



గూడూరురూరల్ : కేంద్ర పభుత్వం నిర్వహించే స్కీమ్ ఫర్ రెసిడియన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ స్టూడెంట్ ఇన్ హౌస్కూల్ టార్గెటెడ్ ఏరియాస్ (శ్రేష్ట) కింద నిర్వహించిన పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఈ మేరకు చెన్నూరుకు చెందిన మహీన్ ఉత్తమ ప్రతిభ కనబరచి 56వ ర్యాంకు సాధించాడు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ప్లస్‌లో సీబీఎస్ సిలబస్ కింద ఏడాదికి రూ 1.35 లక్షల వరకు ఖర్చు చేస్తుంది. రెండేళ్ల పాటు ఉచితంగా వసతి సౌకర్యం కల్పిస్తుంది.

వేడుకగా క్రియా వర్సిటీ స్నాతకోత్సవం


వేదికపై అతిథులు, వర్సిటీ అధికారులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీలోని క్రియా యూనివర్సిటీ స్నాతకోత్సవం -2024ను సోమవారం వేడుకగా నిర్వహించారు. కేంద్ర మాజీ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ కె.విజయరాఘవన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 350 మంది విద్యార్థులకు డిగ్రీలు, అవార్డులు ప్రదానం చేశారు. ఈ క్రమంలనే జెరూసలేంలోని ఇబ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ డేవిడ్ షుల్మాన్ రెనీలాంగ్, ప్రథమ్ ఎడ్యుకేషన్ సీఈఓ డాక్టర్ రుక్మిణీ బెనర్జీకి గౌరవ డాక్టరేట్ అందించారు. కార్యక్రమంలో వర్సిటీ చాన్సలర్ లక్ష్మీనారాయణన్, వీసీ డాక్టర్ నిర్మలారావ్, ఐఎఫ్ఎంఆర్ డీన్ ప్రొఫెసర్ లక్ష్మీకుమార్, సీఆస్ అకడమిక్ డీన్ డాక్టర్ పృథ్వీ దత్తా చంద్రశోభి, రిసెర్చ్ విభాగం డీన్ ప్రొఫెసర్ శివకుమార్ శ్రీనివాసన్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

తిరుపతి లీగల్ : ట్రాక్టర్‌ను అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడిపి ఇద్దరు వ్యక్తుల మృతికి కారకుడైన కేసులో పలమనేరు మండలం, పెంగరగుంటకు చెందిన టి.గురునాథానికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తిరుపతి ఆరవ ప్రత్యేక జూనియర్ జడ్జి కోర్టు సోమవారం తీర్పు చెప్పింది. ఈస్టు స్టేషన్ సీఐ డి.మహేశ్వరరెడ్డి, కోర్టు కానిస్టేబుల్ అయ్యప్ప తెలిపిన వివరాల మేరకు.. 2019, జూలై 3వ తేదీ తిరుపతి శ్రీనివాసం సమీపంలో నిందితుడు గురునాథం సిమెంటు ఇటుకల లోడ్డుతో ఉన్న ట్రాక్టర్‌ను నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న తిరుపతికి చెందిన పి.కోదండపాణి, తమిళనాడు, వేలూరు జిల్లా, వాలాజా తాలూకా, శ్రీనివాసాపురానికి చెందిన ఎ.రాంబాబు మరణించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు తిరుపతి ట్రాఫిక్ పోలీసులు డ్రైవర్ గురునాథంపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం అతనిపై రుజువు కావడంతో ట్రాక్టర్ డ్రైవర్ గురునాథానికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

దాడి కేసులో ఇద్దరు మైనర్లకు..
దాడి కేసులో ఇద్దరు మైనర్లకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తిరుపతి జువైనల్ జస్టిస్ బోర్డు, తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి సోమవారం తీర్పు చెప్పారు.

గ్రీన్‌హౌస్ వినియోగానికి దరఖాస్తులు

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీ గ్రీన్ హౌస్ క్రాప్ ఎంటర్‌ప్రైజెస్ వినియోగించుకునేందుకు ఆసక్తిగల మహిళా పారిశ్రామిక వేత్తలు, ఇంక్యుబేటీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు www.spmvv.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

పద్మావతి వర్సిటీలో ఇంక్యుబేటర్‌కు రూ.19లక్షలు


నిధుల పత్రాలను అందిస్తున్న వీసీ భారతి

తిరుపతి సిటీ: శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో లైవ్లీ హుడ్ బిజినెస్ ఇంక్యుబేటర్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.19లక్షలు విడుదల చేసింది. ఈ సందర్భంగా సోమవారం ఆ విభాగపు కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ జీవనజ్యోతికి వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని నిధుల విడుదలైన పత్రాలను అందజేశారు.

అంబులెన్స్‌కు దారి ఇవ్వని టీడీపీ శ్రేణులు


దారి లేక ఆగిన అంబులెన్స్

గూడూరు రూరల్ : టీడీపీ చేపట్టిన విజయోత్సవ ర్యాలీలో రోగిని తీసుకెళుతున్న అంబులెన్స్‌కు దారిలేక అగచాట్లు పడిన ఘటన పట్టణంలో సోమవారం జరిగింది. అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం గూడూరుకు వస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు భారీ స్వాగతం పలికేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సన్నాహాలు చేశారు. అయితే కార్యకర్తలు చేసే హడావుడి కారణంగా ఓ రోగిని తీసుకెళుతున్న అంబులెన్స్‌కు దారి లేకుండా పోయింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గుర్తించి అంబులెన్స్‌కు దారి ఇవ్వాలని సూచించడంతో పది నిమిషాల అనంతరం కార్యకర్తలు దారి విడిచారు. ర్యాలీ సందర్భంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో పోలీసులు విఫలమైనట్లు పట్టణవాసులు ఆరోపిస్తున్నారు.

సేవ చేశాం.. సహకరించండి

- అర్హులందరికీ పథకాలు అందించాం
- ప్రతి ఒక్కరికీ అండగా నిలిచాం
- మా బాధ్యతలు మాకు అప్పగించండి
- కలెక్టరేట్‌లో వలంటీర్ల ఆందోళన


కలెక్టరేట్ వద్ద వలంటీర్ల ఆందోళన

తిరుపతి అర్బన్ : ప్రజలకు చిత్తశుద్ధితో సేవ చేశామని, తమకు రాజకీయాలతో సంబంధం లేదని, తమకు మళ్లీ బాధ్యతలు అప్పగించాలని శ్రీకాళహస్తికి చెందిన మహిళా వలంటీర్లు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. వలంటీర్లు మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేశామన్నారు. రెడ్‌జోన్‌లోకి సైతం ధైర్యంగా వెళ్లి ప్రజలకు అండగా నిలిచామని గుర్తుచేశారు. అప్పటి ప్రభుత్వం ఆదేశించిన ప్రతి సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తూ వారు కోవిడ్ బారిన పడకుండా అప్రమత్తం చేశామని తెలిపారు. ప్రధానంగా సంక్షేమ పథకాలను కులం, మతం చూడకుండా అర్హులైన అందరిరీ పంపిణీ చేశామని చెప్పారు. రూ.5వేల గౌరవ వేతనం కోసం కాకుండా ప్రజలకు సేవ చేస్తూ ఆత్మసంతృప్తి పొందామని వివరించారు. వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు అందిస్తున్న సందర్భంగా ఎంతో ఆనందంగా ఉండేదని వెల్లడించారు. సిపార్సులతో వలంటీర్‌గా ఎంపిక కాలేదని, ఇంటర్వ్యూలకు వెళ్లి పోస్టు సాధించుకున్నామని స్పష్టం చేశారు. మళ్లీ తమ ప్రాంతంలో తమకు వలంటీర్లుగా పనిచేసే అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ ధాన్య చంద్ర కలిసి వినతిపత్రం అందించారు.

జీతం కోసం పనిచేయలేదు
మేం జీతం కోసం పనిచేయలేదు. సేవా భావంతో మాత్రమే విధులు నిర్వర్తించాం. సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన వారు ఈ విషయాన్ని పట్టించుకోవాల్సి ఉంది. కోవిడ్ సమయంలో శ్రీకాళహస్తి పట్టణంలోని మా వార్డును రెడ్‌జోన్‌గా ప్రకటించారు. అయినప్పటికీ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా సేవ చేశాం. తిరిగి వలంటీర్ పోస్టును మాకు ఇవ్వాలని ప్రార్థిస్తున్నాం.

- అర్చన, వలంటీర్, శ్రీకాళహస్తి

ఇంటింటికీ వెళ్లి సేవ చేశాం
ఇంటింటికీ వెళ్లి వారి బిడ్డలాగా సేవ చేశాం. కరోనా సమయంలో మందులతోపాటు కూరగాయలు, గుడ్లు ఇతర వస్తువులు పంపిణీ చేశాం. రూ.5వేల గౌరవ వేతనంతోనే విధులు నిర్వర్తించాం. వార్డులోకి వెళ్లి వలంటీర్ సక్రమంగా పనిచేయలేదని ఒక్కరైనా చెబితే మాకు పోస్ట్ అవసరం లేదు. ప్రతి ఒక్కరికి సాయంగా ఉన్నాం. ప్రభుత్వం అందించిన పథకాలన్నీ అందించాం. మళ్లీ మాకు సేవా చేసుకునే వెసులుబాటు కల్పించాలని కోరుతున్నాం.

- యామిని, వలంటీర్, శ్రీకాళహస్తి